క్లుప్తంగా

98 శాతం ఈ-కేవైసీ పూర్తి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగైన పంటలకు ఈ- క్రాప్ నమోదు చేయించిన రైతులకు సంబంధించి ఈ-కేవైసీ 98 శాతం పూర్తయ్యిందని ఏఓ రవి గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 5,620 మంది రైతులకు గాను 5,475 మంది రైతులతో ఈ-కేవైసీ చేయించామని చెప్పారు. మిగిలిన వారిని గుర్తించి వెంటనే చేయించేలా చూస్తామని పేర్కొన్నారు.

21న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన హజరత్ బాబా సాహెబ్ తాత ఉరుసు సందర్భంగా ఈనెల 21వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. విజేతలకు వరుసగా.. రూ.20,016వేలు, రూ.10,016వేలు, రూ. 5,016వేలు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీ ఫీజు ఈనెల 20వ తేదీలోపు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 7013058360, 9381646949 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఎల్లార్తిలో షెక్షావలి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి షెక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్ల సమాధులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి ఉదయం నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు దర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డి సాయి బాబా ఆలయాన్ని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

హొళగుంద: స్థానిక సచివాలయ-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్యశిబిరం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శిబిరంలో హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్లు బింధుమాధవి, న్యూటన్‌తో పాటు కర్నూలు నుంచి వైద్య నిపుణులు, సిబ్బంది ప్రజలకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. వివిధ రకాల వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని, మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫరా చేస్తారని వివరించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచలోహ సూర్య రథం విరాళం



రథాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి రూ.3 లక్షల విలువజేసే పంచలోహ రథాన్ని రామలింగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి విరాళంగా అందజేశానపి ఈఓ చంద్రశేఖరరెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకొని స్వామి వారిని ఊరేగించేందుకు సూర్యరథ ప్రభను అందజేయడం సంతోషకరమన్నారు. దాతల కుటుంబ సభ్యులు, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, మాజీ సర్పంచ్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌కు అవార్డు



డ్రైవర్ రాయుడుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో 29 ఏళ్ల డ్రైవర్‌గా పని చేస్తూ ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని ఎమ్మిగనూరు డిపో డ్రైవర్ ఎస్.రాయుడు జిల్లాలో రెండవ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ డీపీటీఓ శ్రీనివాసులు నుంచి ఆయన అవార్డు పొందారు.దీంతో గురువారం స్థానిక డిపోలో ఆయనకు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పంపయ్య ప్రోత్సాహక చెక్కు అందజేశారు. డిపో మేనేజర్ అమర్నాథ్‌తో పాటు నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ అభినందించారు.

మద్దికెరకు నేడు ఎమ్మెల్యే రాక

మద్దికెర : స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 16వ తేదీన సాయంత్రం వలంటీర్లకు నిర్వహించనున్న సన్మానసభకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశులు గురువారం తెలిపారు.

తీరనున్న దారి కష్టాలు

- టి.గోకులపాడు వద్ద హంద్రీపై బ్రిడ్జీ ఏర్పాటుకు చర్యలు
- వంతెన పూర్తయితే రైతుల కష్టాలకు చెక్
- 10 నిమిషాల్లో మండల కేంద్రానికి చేరుకునే అవకాశం
- కంబాలపాడు-కోయిలకొండ మధ్య బ్రిడ్జి, బీటీ రోడ్డుకు నిధుల మంజూరు
- రెండు బ్రిడ్జీల ఏర్పాటుకు రూ.11 కోట్లు విడుదల
- నేడు పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



గోకులపాడు గ్రామ సమీపంలో హంద్రీపై బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం

కృష్ణగిరి: ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన కృష్ణగిరి మండలం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి పథంలో పరుగులు పెడుతుంది. నాడు అభివృద్ధికి ఆమడ దూరంగా నిలిచిన ప్రాంతం.. నేడు మారిన రూపురేఖలతో అబ్బురపరుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు ఆధునిక సదుపాయాలతో కళకళలాడుతున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు మరో రెండు బ్రిడ్జీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో ఎన్నో ఏళ్లుగా రైతులు, వాహనదారులు పడుతున్న కష్టాలు తీరనున్నాయి.

రూ.11కోట్లతో శంకుస్థాపన

టి.గోకులపాడు గ్రామంలో దాదాపుగా 750 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామం మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామానికి అనుకుని పాల హంద్రీ ఉంది. గ్రామ రైతులకు సంబంధించిన 70 శాతం పొలాలు హంద్రీకి అవతల వైపు ఉన్నాయి. వీరు ప్రతేడాది పొలాలకు నిత్యం నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి. భారీ వర్షం కురిసి హంద్రీ పొంగితే ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత ఎన్నికల సమయంలో బ్రిడ్జీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నిర్మాణానికి రూ.7.95 కోట్లు మంజూరు చేయించారు. బ్రిడ్జీ, రామకృష్ణాపురం వరకు నాలుగు కిలోమీటర్లు బీటీ రహదారి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు.

10 నిమిషాల్లో మండల కేంద్రానికి ..

వంతెన, రామకృష్ణాపురం వరకు బీటీ రహదారి పూర్తయితే టి.గోకులపాడు నుంచి 10 నిమిషాల్లో మండల కేంద్రానికి చేరుకోవచ్చు. ఇప్పటి వరకు గ్రామస్తులు వెల్దుర్తికి వచ్చి అక్కడి నుంచి మండల కేంద్రానికి రావడానికి 20 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు. బ్రిడ్జీ ఏర్పాటుతో 11 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

కేఈ స్వగ్రామానికి..

కటారుకొండ, ఆలంకొండ, చిట్యాల తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కోయిలకొండ నుంచి కేఈ స్వగ్రామమైన కంబాలపాడు గ్రామం మీదుగా వెళ్లాలి. కోయిలకొండ-కంబాలపాడు గ్రామాల మధ్య బీటీ రహదారి ఏర్పాటుకు 2019 ఎన్నికల ముందు హడావుడి చేసి మధ్యలో వదిలేశారు. అప్పటి నుంచి దాదాపు 10 గ్రామాల ప్రజలు రాళ్ల దారిలో రావాల్సిన పరిస్థితి. దీనికితోడు రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు బ్రిడ్జీ పూర్తిగా దెబ్బతింది. రెండు గ్రామాల మధ్య బీటీ రహదారి, బ్రిడ్జీ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయడంతో వాటి పనులను కూడా నేడు ప్రారంభించనున్నారు. అలాగే కంబాలపాడులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తారు.



కంబాలపాడు-కోయిలకొండ గ్రామాల మధ్య బ్రిడ్జి ఏర్పాటు చేయనున్న ప్రాంతం

బ్రిడ్జీ వస్తుందని ఊహించలేదు



హంద్రీపై బ్రిడ్జి నిర్మిస్తారని ఊహించలేదు. దశాబ్దాల కాలంగా కోట్ల, కేఈ కుటుంబాలు పాలించినా మా సమస్యను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామానికి వచ్చినప్పుడు బ్రిడ్జీ ఏర్పాటు చేయాలని కోరగా సరేనన్నారు. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉంది.

– మల్లయ్య, టి.గోకులపాడు

మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డాం



మా గ్రామం మండల కేంద్రానికి దగ్గరగానే ఉన్నా.. హంద్రీ ఉండటంతో వంతెన లేక వెల్దుర్తికి వెళ్లి 20 కిలోమీటర్లు వెళ్తున్నాం. హంద్రీపై బ్రిడ్జీ ఏర్పాటు చేస్తే ఆ అవస్థలు తప్పుతాయి. పంట ఉత్పత్తులు హంద్రీలో తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడ్డాం. ఇవన్నీ త్వరలో తీరనున్నాయి.

– ప్రభాకర్‌రెడ్డి, టి.గోకులపాడు

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గోనెగండ్ల: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది, ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాఘునాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహించి డీఈఓ చిత్రపటాన్ని దహనం చేశారు. వారు మాట్లాడుతూ జీనియస్ గ్లోబల్ స్కూల్ పెట్రోల్ బంక్‌కు అనుకొని ఉందని, అలాగే మెయిన్‌రోడ్డు పక్కనే ఉండడం వలన ఏదైన ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. నాయకులు భరత్, వీరేష్, ప్రసాద్, నాయుడు, బాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ, చిట్యాల, కంబాలపాడు, అమకతాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనురాధ గురువారం పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని చెప్పారు. మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా



మృతి చెందిన రైతు కుటుంబాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా భరోసానిస్తూ అండగా నిలిచిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం చెరుకులపాడులో ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెల్దుర్తి మండలంలోని ముగ్గురు బాధిత రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.7లక్షల ప్రకారం రూ.21లక్షల మెగా చెక్కు అందించారు. కొసనాపల్లె పెద్ద బోడెన్నగారి లక్ష్మన్న భార్య వాసు దేవమ్మ, పేరేముల భోగ్యం రాజేశ్ భార్య సువర్ణ, పేరేముల తెల్లగల్ల దానమయ్య కుమారుడు కేశవయ్య చెక్కు అందుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు ముందుగా టీడీపీ సానుభూతిపరుడా కాదా అని చూసి, ఆ తర్వాత సిఫారసు మేరకు రూ.5లక్షలు ఇచ్చేవారని, అది కూడా రూ.1.5లక్షలు అప్పులకు జమ చేయడంతోపాటు, రూ.3.4 లక్షలను విత్‌డ్రా చేసుకునే వీలులేకుండా డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని మాత్రమే వాడుకునే పరిస్థితి కల్పించేవారని గుర్తు చేశారు. దీంతో ఆ కుటుంబానికి పరిహారం అందే నాటికే చితికిపోయేదన్నారు. జగనన్న పాలనలో పరిహారాన్ని రూ.7లక్షలకు పెంచి ఆదుకుంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీలు డి.సుంకన్న, కేఈ సుభాషిణి, పేరేముల సర్పంచ్ రాధా కృష్ణారెడ్డి, పుల్లగుమ్మి ఎంపీటీసీ నాగార్జున రెడ్డి, రామళ్లకోట మాధవస్వామి, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడుకోవడానికి శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన రైతు సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందన్నారు. రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు చట్టాల ఉపసంహరణ సమయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్.మునెప్ప, శ్రీనివాసులు, చంద్రశేఖర్, సాయిబాబా, విజయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ రైతులు చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు నాయకంటి రాజు ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కార్మిక, రైతు చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మికులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు రాముడు, గోపాల్, హరికృష్ణ, సంతన్న, దశరత్ పాల్గొన్నారు.

మంచినీరు వృథా



వందవాగిలి రోడ్డులో పైపు లీకై వృథా అవుతున్న నీరు

హొళగుంద: మంచినీటి పైప్‌లైన్, వాల్ నుంచి నీరు లీకవుతుండటంతో నీరు వృథాగా పారిపోతోంది. వందవాగిలి గ్రామానికి కడ్లమాగి ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్, వాల్ ప్రదేశాల్లో లీకులు ఏర్పడి నీరంతా వృదా అవుతోందిన. దీంతో గ్రామానికి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కాకపోతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులే పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు.



'సిద్ధం' పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

సిద్ధం సభకు తరలిరండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభకు తరలిరావాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం వెల్దుర్తి మండలం చెరుకులపాడులోని స్వగృహంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమై 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి అమలుతో సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని, ప్రజలకు మరింత వివరంగా చెప్పి, ఫ్యాను గుర్తుపై ఓటు వేయించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, అధ్యక్షులు డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, బొమ్మన రవిరెడ్డి, కేఈ సుభాషిణి, దాదిపోగు సుంకన్న, ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, వెల్దుర్తి సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్‌రెడ్డి, పార్టీ వెల్దుర్తి మండల కార్యదర్శి వెంకట్‌నాయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, పార్టీ జిల్లా యువజన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం..



కంబాలపాడులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

కృష్ణగిరి: మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ గురువారం తెలిపారు. ఉదయం టి.గోకులపాడు సమీపంలో హంద్రీపై బ్రిడ్జీ నిర్మాణానికి భూమి పూజ చేసి అనంతరం కంబాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, కంబాలపాడు- కోయిలకొండ గ్రామాల మధ్య బీటీ రహదారితో పాటు బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తారని వివరించారు.

తుగ్గలి : మండలంలోని బొందిమడుగుల సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం భూమి పూజ చేస్తారని వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండల అధ్యక్షులు నాగేష్, హనుమంతు గురువారం తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.35కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. అలాగే రూ.2 కోట్లకుపైగా నిధులతో పగిడిరాయి, కడమకుంట్లలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు, జొన్నగిరిలో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఓబులేసు

నందవరం : సార్వత్రిక ఎన్నిలకలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ అధికారులు ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఓబులేసు ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈవీఎంలు, విధులు తదితరాలపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో మౌలిక వసతులను కల్పించి ఎప్పటికప్పుడు బీఎల్‌ఓలు పరిశీలించాలన్నారు. ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, డీటీ రఘువీర్, ఆర్ఐ జెర్మియా, సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు ఏఓ మఠ్రి స్రవంతి, ఏపీఎం చిన్నవీరన్న, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతి చెందిన రోషన్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నం బట్టి వీధిలో నిర్మిస్తున్న ఇంటిపైకి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో రోషన్ అనే యువకుడు గురువారం మృతి చెందాడు. మద్యం మత్తులో నిర్మిస్తున్న ఇంటిపైకి వెళ్లిన ప్రమాదవశాత్తు కాలుజారి విద్యుత్ తీగలపై పడటంతో షాక్‌తో కింద పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే మృతుడి మెడపై గాయం ఉండటంతో ఆత్మహత్యానా, లేక హత్యానా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆలూరు: హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయకార్యదర్శి బి. మహేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామాంజనేయులు, ఆలూరు నియోజకవర్గం ఏఐటీయూసీఅధ్యక్షుడు శివ కోరారు. గురువారం ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి వినతి పత్రం అందజేశారు.మంత్రి మాట్లాడుతూ కార్మిక శాఖ పరిధిలో గుర్తింపు పొందిన హమాలీల యూనియన్లను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుందని చెప్పారు.ఈఎస్ఐ, పీఎఫ్, బీమా తదితర వాటిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఏఐటీయూసీ నాయకులు గోపాల్, సిద్ధలింగ ఉన్నారు.

మగ్గం.. చిద్విలాసం

- చేనేతలకు 'నేతన్న నేస్తం' కింద ఏటా రూ.24 వేలు
- ఐదు విడతల్లో 6,794 మందికి రూ.16.30 కోట్ల లబ్ధి
- ఆనందంలో చేనేత కుటుంబాలు

ఐదేళ్ల క్రితం వరకు మగ్గాలు ముట్టుకోవడానికి కూడా చేనేతలు జంకేవారు. నాటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేత పనులు మానుకొని కూలీ పనులు వెతుక్కోసాగారు. కొందరు మగ్గం గుంతలు కూడా పూడ్చివేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక నేతన్న చేయిపట్టి నడిపించేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం పేరుతో ఆర్థికంగా ఆదుకున్నారు. ఏటా రూ.24వేల ప్రకారం ఐదు విడతలు అందజేశారు. అంతేకాకుండా ఆధునిక సాంకేతికత వినియోగించుకునేలా నూతన యంత్రాలను అందజేశారు. దీంతో మగ్గం చిద్విలాసం చిందిస్తుండగా.. చేనేతపురిలో మగ్గం సవ్వడులు వేగమందుకున్నాయి.



చేనేతలకు వైడబ్ల్యూసీఎస్ ద్వారా యంత్ర సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి (ఫైల్)

ఎమ్మిగనూరుటౌన్: సన్నని దారం...చక్కని పనితనం.. చూపరులను ఆకట్టుకొనే వర్ణం.అందంతో పాటు హాయినిచ్చే వస్త్రం. హుందాతనాన్ని తెచ్చిపెట్టే గొప్పపనితనం.. వస్త్రాల తయారీలో అద్భుత కళ.. చేనేత. వినడానికి బాగేనే ఉన్నా ఈ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న చేనేత కార్మికుల బతుకులు ఐదేళ్ల క్రితం వరకు ఎంతో దుర్లభం . ఇందుకు నాటి ప్రభుత్వం తీరే కారణం. చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరులో వేలాది మంది ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. సమస్యలు ఆ రంగాన్ని చుట్టుముట్టాయని, ఎంతో ప్రఖ్యాతి గాంచిన నైపుణ్యం నిర్వీర్యమవుతుందని తెలిసినా నాటి పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎంతో మంది కార్మికులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోవడంతో మగ్గాలు నిరుపయోగంగా మారాయి. కేవలం హామీలు మాత్రమే ఇచ్చి అమలు మరవడంతోనే చేనేత రంగమే కుదేలయ్యే దుస్థితి దాపురించింది. 2019లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేతలకు జగనన్న ఆపన్న హస్తం అందించారు. వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయడానికి సంకల్పించారు. అనుకున్నదే తడవుగా, ఇచ్చిన మాట నెరవేర్చడంలో భాగంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పేరుతో సంక్షేమ పథకం ప్రారంభించారు.

ఏటా రూ.24వేలు..

ఎన్నికల సమయంలో మగ్గం ఉన్న ప్రతి చేనేతకు ఏటా రూ.24వులు ఇచ్చి నేతపనికి ఊతం ఇచ్చి ఆదుకుంటానని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు చేనేతలు ఎక్కువగా ఉండే ఎమ్మిగనూరులో మగ్గం వున్న చేనేతలు 6,794 మంది లబ్ధిదారులుగా మారారు. వారికి ఐదు విడతల్లో రూ.16,30,56,000 లబ్ధి చేకూర్చారు. వారి బ్యాంక్ ఖాతాలో ఏటా రూ.24వేల చొప్పున ఐదు విడతలు జమచేశారు. దీంతో చేనేత కార్మికుల కుటుంబాలు నేడు ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కి ఆనందంతో ఉన్నాయి. కులవృత్తిని వదులుకొని ఇతర వృత్తుల్లో వెళ్లిన నేతన్నలు మళ్లీ తమ పూర్వపు పనిని పునరుద్ధరించుకున్నారు. అలాగే చేనేతలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం చేనేత, జౌలిశాఖ ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ ద్వారా ఆధునిక యంత్ర పరికరాలను సమకూర్చిం పని వేగంగా సాగేలా చేసింది. చేనేత కార్మికులకు కూడా వివిధ రకాల సంక్షేమ పథకాలను అందజేయడంతో వారిప్పుడు సంతోషంగా గడుపుతున్నారు.

నేతన్న నేస్తంతో తొలగిన కష్టాలు



సీఎం జగనన్న ఇచ్చిన నేతన్న నేస్తంతో మా కుటుంబంలో ఆర్థిక కష్టాలు తొలగిపోయాయి. ముడి సరుకు తెచ్చుకొని మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాం. అమ్మఒడి, విద్యాదీవెన పథకాలతో నా ఇద్దరు కూమార్తెలను చదువుకుంటున్నారు. పథకాలతో మాకుటుంబం సంతోషంగా వుంది..వృత్తినే నమ్ముకొని అప్పులు చేసి నెట్టుకొస్తున్న వేళ ఆర్థికంగా ఆదుకున్నారు. – ఈరమ్మ,
చేనేత కార్మికురాలు,ఎమ్మిగనూరు

కష్టకాలంలో అండగా..



వృత్తిని నమ్ముకొని జీవించే మాకు కష్టకాలంలో వైఎస్సార్ నేతన్న నేస్తం అండగా నిలిచింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఏటా రూ.24 వేల ప్రకారం ఐదేళ్లు ఇవ్వడంతో మా కుటుంబానికి, వృత్తికి ఆర్థికంగా ఆసరా లభించింది. – విజయశంకర్,
చేనేత కార్మికుడు,ఎమ్మిగనూరు

జగనన్న మాట నిలబెట్టుకున్నాడు



ఎన్నికల ముందు ఇచ్చే హామీలు ఎక్కడ నెరవేరుస్తారు అనుకున్నాం. కానీ జగనన్న తన మాట నిలబెట్టుకొని రూ.24వేల చొప్పున ఐదు సంవత్సరాలు ఇచ్చారు. చేనేత వృత్తిని నమ్ముకొని జీవించే మాలాంటి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. – సుజాత,
చేనేత కార్మికురాలు,ఎమ్మిగనూరు